ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 6
సంపుటి : 3
సంచిక : 70

సోమవారం 12 ఆగస్టు 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR,RANGAREDDY, MEDAK, ADILABAD

## ఆరు పతకాలతో సంతృప్తి



.. వివరాలు 5లో



## అగ్నిపథ్ మంచి స్కీం..

### విపక్షాల వలలో పడొద్దు

### కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్– సాహసోపేత నిర్ణయాలకు కేరాఫ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని కొనియాడారు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. కరీంనగర్ రేకుర్తి రాజశ్రీ గార్డెన్‌లో ధల్లీ డిఫెన్స్ అకాడమి ఫ్రెషర్స్ డే వేడుక లకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ లో పనిచేయడమంటే దేశానికి సేవ చేయడమే నని.. విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంచుతూ క్రమశిక్షణను అలవర్చుతూ అత్యున్నతంగా తీర్చిదిద్దుతున్న ధల్లీ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకులను ఆయన అభినందించారు. యూపీఏ 10 ఏళ్ల పాలనలో 7 లక్షల లోపు మాత్రమే ఉద్యోగాలు భర్తీ చేసిందని, మోదీ ప్రభుత్వం ప్రతినెలా 70 నుండి 90 వేల ఉద్యోగాల చొప్పున ఒక్క ఏడాదిలో 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తోందని వివరించారు. 2014 నుండి 2023 వరకు 8 లక్షల ఉద్యోగాలకుపైగా భర్తీ చేసినట్లు చెప్పారు. అంతేగాకుండా 8 కోట్ల

మిగతా 2 లో

# రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు..

## 30,750 కొత్త ఉద్యోగాలు



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన విజయవంతం
- ఫ్యూచర్ సిటీకి పారిశ్రామికవేత్తల మద్దతు లభించిందని వెల్లడి..
- దక్షిణ కొరియాకు బయల్దేరిన సీఎం
- అమెరికాకు సరికొత్త తెలంగాణ పరిచయం చేశాం..
- పెట్టుబడుల వెల్లువతో అపార ఉద్యోగావకాశాలు: శ్రీధర్‌బాబు

రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం చేపట్టిన విదేశీ పర్యటన విజయవంతంగా సాగుతోంది. పది రోజుల ప్రణాళికలో భాగంగా ఏడు రోజుల పాటు అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి.. ఆదివారం దక్షిణ కొరియాకు పయనమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులకు వివిధ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన భారీ అమెరికా కంపెనీలు ముందుకొచ్చాయి. 19 అంతర్జాతీయ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు అంగీకారం తెలిపాయి.

హైదరాబాద్, ఆగస్టు 11 : రూ.31,532 కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తద్వారా 30,750 ఉద్యోగాలు రానున్నాయి. అమెరికా వేదికగా సీఎం రేవంత్ తెలంగాణను ఫ్యూచర్ స్టేట్‌గా ప్రకటించడం, హైదరాబాద్‌లో నాలుగో నగరం అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంచుకున్న వివిధ ప్రాజెక్టులను వివరించడంపై మంచి స్పందన లభించింది. కాగా, అమెరికా పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచంలో పేరొందిన కంపెనీలతో సంప్రదింపులు, చర్చలతో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త

మిగతా 2 లో



## హైదరాబాద్‌లో అమెజాన్ 4వ డేటా సెంటర్!

- పెట్టుబడులను మరింత విస్తరిస్తాం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో చర్చల అనంతరం సంస్థ వెల్లడి
- తెలంగాణ సర్కారు 'డిజిటల్' లక్ష్యాల సాధనకు సహకరిస్తాం
- మా సంస్థ వృద్ధి వ్యూహంలో హైదరాబాద్ విడదీయలేని భాగం
- అమెజాన్ ఉపాధ్యక్షుడు కెర్రీ పర్సన్

హైదరాబాద్, ఆగస్టు 11 : ఇప్పటికే మూడు డేటా సెంటర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ (ఏడబ్ల్యూఎస్).. పెట్టుబడులను మరింత విస్తరించడంతోపాటు, నాలుగో డేటా సెంటర్ ఏర్పాటుకు సిద్ధమైంది. కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ ఆధారిత సేవల నిమిత్తం.. కొత్త హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటుచేయడం, రాష్ట్రంలో తమ పెట్టుబడుల విస్తరణ వంటి ప్రణాళికల గురించి ఆ సంస్థ

మిగతా 2 లో



## తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయింది

డ్యామ్‌లో 19వ గేటు ఎత్తుతుండగా తెగిన చైన్‌లింక్

- వరదలో గేటు గల్లంతు.. ఇప్పటికిప్పుడు మరమ్మతు కష్టం
- నీటి నిల్వ 40 టీఎంసీలకు తగ్గితేనే కొత్త గేటు అమర్చే చాన్స్
- దిగువకు 65 టీఎంసీలు.. ఇప్పటికే నిండుగా శ్రీశైలం, సాగర్ పులిచింతల, ప్రకాశం కూడా.. వచ్చే నీరు సముద్రంలోకే!

అమరావతి, ఆగస్టు 11 : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు సాగు, తాగునీటి ప్రదాయిని అయిన తుంగభద్ర డ్యామ్ గేటు వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది! శనివారం రాత్రి డ్యామ్ 19వ గేటును ఎత్తుతుండగా చైన్‌లింక్

## ఐదేళ్లలో 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు

### ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతలే లక్ష్యం

- 'సీతారామ'తో ఖమ్మం సస్యశ్యామలం
- 15న సీఎం రేవంత్ చేత ప్రాజెక్టు ప్రారంభం
- సీతారామ ట్రయల్ రన్ ప్రారంభంలో ఉత్తమ్



కొత్తగూడెం, ఖమ్మం ఆగస్టు 11: వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 30–35 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరవ్వడమే లక్ష్యమని భారీ నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వీలైనంత తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సాగులోకి తెస్తున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల బిల్లులను వెంటనే మంజూరు



## నేడు సుప్రీంలో కవితకు బెయిల్ విచారణ

### బెయిల్ వచ్చేనా..?

- జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందుకు దరఖాస్తు
- సిసోడియాకు బెయిల్ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్గాల్లో ఆశలు

న్యూఢిల్లీ, ఆగస్టు 11 : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరగనుంది. తనపై ఈడీ, సీబీఐలు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్

మిగతా 2 లో



## బ్రాండ్ తెలంగాణను బలిపెట్టొద్దు

ప్రభుత్వ పాలసీలు పెట్టుబడులను ఆకర్షించాలి

- కాంగ్రెస్ సర్కారు స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టొద్దు
- ఎంతో కష్టపడితే వచ్చిన 'అమరరాజా' రాష్ట్రాన్ని వీడుతామని ప్రకటించడం బాధాకరం
- కేన్స్, కార్నింగ్ వేరే రాష్ట్రాలకు తరలిపోయినయ్
- ఇదీ విపత్తు లాంటిదే.. కేటీఆర్ తీవ్ర ఆవేదన

హైదరాబాద్, ఆగస్టు 11 : బ్రాండ్ తెలంగాణను కాపాడాలని ప్రభుత్వానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండకపోతే రాష్ట్రం నుంచి వెళ్లిపోతామని అమరరాజా సంస్థ ప్రకటించినట్టుగా వార్తలు వస్తున్నాయని, అదే నిజమైతే అంతకన్నా దురదృష్టకరం మరొటి ఉండదని, ఇది విపత్తులాంటిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి అర్థంకాక చాలాసంస్థలు రాష్ట్రాన్ని వీడుతున్నాయని ఆందోళన

మిగతా 2 లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
12 ఆగస్టు
2024





# రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు..



### మొదటి పేజీ తరువాయి

భాగస్వామ్యానికి నాంది పలికిందన్నారు.
స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సిటీ నుంచి ఫ్యూచర్ సిటీ నిర్మించేందుకు తమ సర్కారు ఎంచుకున్న ప్రణాళికలకు అమెరికా పారిశ్రామికవేత్తల నుంచి భారీ మద్దతు లభించిందని పేర్కొన్నారు. తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా, అభివృద్ధికి దోహదపడేలా ప్రఖ్యాత కంపెనీలు పెట్టుబడులకు ముందుకురావడం శుభసూచకమని తెలిపారు. మరోవైపు అమెరికా వ్యాపార సామ్రాజ్యానికి సరికొత్త తెలంగాణను పరిచయం చేశామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు.
రాష్ట్రంలో వివిధ రంగాల పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం అందించే సహకారాన్ని చాటి చెప్పేందుకు ఈ పర్యటన ఉపయోగపడిందని అభిప్రాయపడ్డారు. దీని ప్రభావంతో తెలంగాణకు పెట్టుబడులు వెల్లువెత్తడంతో పాటు అపారమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఆదివారం శాన్‌ఫ్రాన్సిస్కోలోని వేమోలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు డ్రైవర్ రహిత కారు పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ కారులో సీఎం కొంత దూరం ప్రయాణించారు.

#### 50 మందిపైగా వ్యాపారవేత్తలతో సమావేశం

రేవంత్, శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఐటీ, ఆర్థిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్‌రంజన్, రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ, సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌తో కూడిన ఉన్నతాధికారుల బృందం ఈ నెల 3న అమెరికాకు బయల్దేరింది. ఏడు రోజుల్లో 50 మందిపైగా వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు. కృత్రిమ మేధ, ఫార్మా-లైఫ్ సైన్సెస్, విద్యుత్తు వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ ఎలక్ట్రానిక్ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి కంపెనీలు ఆసక్తి చూపించాయి.
కాగ్నిజెంట్, చార్లెస్ స్వాబ్, ఆర్సీసీఎం కార్నింగ్, అమెజాన్, జొయిటిస్, హెచ్‌సీఏ హెల్త్ కేర్, వివింట్ ఫార్మా, థర్మో ఫిసర్, ఆరమ్ ఈక్విటీ, ట్రైజిన్ టెక్నాలజీస్, మోనార్క్ ట్రాక్టర్ కంపెనీలు రాష్ట్రంలో విస్తరణ, కొత్త కేంద్రాలు నెలకొల్పేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. హైదరాబాద్‌లో డేటా సెంటర్ విస్తరణకు అమెజాన్ తీసుకున్న నిర్ణయం మైలురాయిగా నిలిచింది. సీఎం బృందం యాపిల్, గూగుల్, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, ప్రపంచబ్యాంక్ ప్రతినిధులతోనూ చర్చలు జరిపింది.

#### హైదరాబాద్‌లో అమెజాన్ 4వ డేటా సెంటర్!

ఉపాధ్యక్షుడు (ప్లానింగ్ అండ్ డెలివరీ) కెర్రీ పర్సన్ వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం ఆదివారం కెర్రీ పర్సన్‌తో సమావేశమయ్యారు. అమెజాన్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని, విజయవంతమయ్యాయని.. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారంతో పాటు అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చామని.. మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ సేవల వృద్ధికి హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తుందని.. కెర్రీ పర్సన్ ఆశాభావం వెలిబుచ్చారు.
తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ వృద్ధిలో ఆశించిన లక్ష్యాలను అందుకునేందుకు తమ కంపెనీ సహకారం తప్పకుండా ఉంటుందని.. అలాగే, ఏడబ్ల్యూఎస్ అభివృద్ధి వ్యూహంలో హైదరాబాద్ విడదీయలేని భాగమని ఆయన పేర్కొన్నారు. కొత్త డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన పెట్టుబడులపై కంపెనీ త్వరలో ప్రకటన చేసే అవకాశాలున్నాయి. కాగా.. కెర్రీపర్సన్‌తో జరిగిన సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, సీఈవో మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

#### ఇప్పటికే..

అమెజాన్ కంపెనీకి చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనం హైదరాబాద్‌లో ఉంది. గత ఏడాది.. అమెజాన్ సంస్థ డెడికేటెడ్ ఎయిర్‌కార్గో నెట్‌వర్క్ అయిన 'అమెజాన్ ఎయిర్'ను భాగ్యనగరంలోనే ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇక.. ఆ సంస్థకు చెందిన మూడు పెద్ద డేటా సెంటర్లు ఇప్పటికే ఇక్కడి నుంచి కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి.

# ఎత్తిపోతల పథకాలు ఏడాదిలోపు పూర్తి

**మిర్యాలగూడ నియోజకవర్గం**

**పరి ధిలోని 5 ఎత్తిపోతలు పూర్తి చేస్తాం**
**ఎత్తిపోతల పథకాల పూర్తి కి నిధు ల కొరత లేనేలేదు**
**స్థానిక శాసనసభ్యులు కోరిన వా చ్యతాండ**
**ఎత్తిపోతలతో 3 చెక్ డ్యాములు మంజూరు**
**రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

మిర్యాలగూడ: రైతుల జీవితాలలో వెలుగు నింపాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమా ర్ రెడ్డి అన్నారు.ఆదివారం అయన నల్గొండ జిల్లా, మిర్యాలగూడ నియోజకవర్గం, అడవిదేవులపల్లి మండలం,చిట్యాల గ్రామం దున్న పోతుల గండి ఎత్తిపోతల పథకం సైట్ ను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ముందుగా చిట్యా ల గ్రామం , దున్నపోతుల గండి లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,ఇతర ప్రజా ప్రతినిధులు మంత్రికి ఘన స్వాగతం పలికారు.

దున్నపోతుల గండి ఎత్తిపోతల పథకం ఇంటేక్ వెల్ ను, కృష్ణా నది నుండి దున్నపోతుల గండి ఎత్తిపో తల పథకం ఇంటెక్ వెల్ కు వచ్చే హలియా వాగును మంత్రి అధికా రులతో కలిసి పరిశీలించారు .

అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ముం దుగా చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మిర్యాలగూడ నియోజ కవర్గంలో చేపట్టనున్న దున్నపో తుల గండితో పాటు ,ఇతర ఎత్తిపో తల పథకాల పై వివరించారు. అడ విదేవుల పల్లి మండలం చిట్యాల గ్రామం వద్ద చేపట్టిన దున్నపోతుల గండి ఎత్తిపోతల పథకం కింద 12239 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 219.19 కోట్ల రూపాయలతో చేపట్టడం జరిగిందని, ఇందుకు సంబంధించి పంపు హౌస్, అప్రోచ్ కాలువల మట్టి తవ్వకం పనులు పురోగతిలో ఉన్నాయని, ఈ ఎత్తిపోతల ద్వారా ఉల్సాయపాలెం, మొల్కచర్ల, బాల్నేపల్లి, చాంప్ల తండా, కొత్త నందికొండ, అడవిదేవులపల్లి, చిట్యాల గ్రామాల లోని 12,239 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.

దామరచర్ల మండలం బోత్తలపాలెం ఎత్తిపోతల పథకం కింద 8610 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించడం జరిగిందని, ఇందుకు 259.25 కోట్ల రూపాయల పరిపాలన మంజూరు కావడం జరిగిందని, బోత్తలపాలెం ,రాజాగట్టు, దామరచర్ల, నర్సాపూర్, తాళ్ల వీరప్ప గూడెం ,కొత్తపల్లి, వాడపల్లి గ్రామాలలోని 8610 ఎకరాలకు సాగునీరు అందుతున్నదని వివరించారు. వీర్లపాలెం -2 ఎత్తిపో తల పథకం కింద 2,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకుగాను, 32.22 కోట్ల రూపాయలు పరిపాలన అనుమతి మంజూరు చేయడం జరిగిందని, వీర్లపాలెం, ముదిమాణిక్యం, అడవిదేవులపల్లి లోని 2500 ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. తోపుచర్ల ఎత్తిపోతల పథకం కింద 9 కోట్ల 30 లక్షల రూపాయల ప్రతి పాదిత వ్యయంతో 316 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభు త్వం పరిపాలన అనుమతి మంజూరు చేసిందని ,ఇందులో భాగంగా తోపుచెర్ల చిన్న చెరువు, పెద్ద చెరువు, బల్పవానికుంట, పుచ్చకాయల గూడెం, గణపతి వారి గూడెం, బొమ్మకల్ గ్రామాలకు లోని 316 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలియజేశారు. కేశవపురం ఎత్తిపోతల పథకం ద్వారా 5875 ఎకరాలకు సాగునీరు అందించాలని, 75.9 3 కోట్ల రూపాయలు ప్రభుత్వం పరిపాలన అనుమతి మంజూరు చేసిందని ,ఇందులో భాగంగా కేశవపురం, కొండరపోలు దామరచర్ల లోని 5875 ఎకరాలకు సాగునీరు అందనున్నదని ఆయన వివరించారు. మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లా డుతూ గత పది సంవ త్సరాల నుండి మిర్యాలగూడ నియోజకవ ర్గం లోని ఎత్తిపోతల పథకాల పూర్తికి గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని చెంతనే కృష్ణా నది నీరు ఉన్నప్పటికీ, ఎలాంటి ఉపయోగం లేకుండా కిందికి తరలిపోయాయని, తనకు ఈరోజే తెలంగాణ వచ్చినంత ఆనందంగా ఉందని అన్నారు.

# తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయింది



### మొదటి పేజీ తరువాయి

తెగిపోవడమే ఇందుకు కారణం. ఆ గేటు వద్ద వరద ప్రవాహ ఉధృతి పెరిగి ప్రాజెక్టుకు మరింత ప్రమాదం వాటిల్లకుండా ఉండేందుకు మిగిలిన 32 గేట్లను 2 నుంచి 3 అడుగుల మేర ఎత్తి 1.10 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వదులుతున్న నీరు సోమవారం ఉదయానికి లక్షన్నర క్యూసెక్కులకు పెరగొచ్చని.. తీరప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని బోర్డు అధికారులు హెచ్చరించారు.
నీటి ఉధృతి కారణంగా మరమ్మతులు చేయలేని పరిస్థితి ఏర్పడడంతో.. శాశ్వత మరమ్మతులు చేసేందుకు స్పిల్ లెవల్ వరకూ డ్యామ్‌ను ఖాళీ చేయాలని అధికారులు నిర్ణయించి 65 టీఎంసీల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. అయితే, భారీ వర్షాల కారణంగా ఇప్పటికే శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీలు నిండిపోవడంతో తుంగభద్ర నుంచి వచ్చే నీరంతా సముద్రంలోకి వదిలిపెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. మరమ్మతులకు సంబంధించి సూచనలు చేసేందుకు.. హైదరాబాద్‌కు చెందిన డ్యామ్ గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, కర్ణాటక నీరావరి నిగమ్ లిమిటెడ్ (కేఎన్ఎన్ఎల్) ప్రాజెక్టు నిపుణుడు రాజేశ్ సహా హైదరాబాద్, బెంగళూరుకు చెందిన ప్రాజెక్టు నిపుణులు కూడా అక్కడకు చేరుకున్నారు.
డ్యామ్ ఖాళీ చేయకుండా గేటు మరమ్మతుపై వీరు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కాగా.. 65 టీఎంసీల నీరు కిందకు వెళ్లడానికి కనీసం మూడ్రోజులు పడుతుందని బోర్డు వర్గాలు తెలిపాయి. స్టాప్‌లాక్ ఏర్పాటు లేకపోవడమే ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం. వీటి ఏర్పాటు సర్వే కోసం 2020లో నాటి ఎస్ఈ వెంకటరమణ ఇచ్చిన నివేదికను బుట్టదాఖలు చేయడం గమనార్హం. మ-రోవైపు.. సమృద్ధిగా వానలు కురిసి జులైలోనే జలాశయాలన్నీ నిండిపోవడంతో ఈసారి ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుకు, తాగునీటికి ఇబ్బంది లేదని రైతులంతా ఆనందంగా ఉన్నారు. ఇంతలోనే జరిగిన ఈ ఘటనతో వారి ఆనందం ఆవిరైంది.

#### రిస్కు తీసుకోవద్దు: జలసంఘం

డ్యామ్ గేట్లు పురాతనమైనవి కావడంతో పాటు మరమ్మతు చేసేందుకు పరిస్థితులు అనువుగా లేవు. ఆదివారం అప్పటికప్పుడు స్టాప్‌లాక్‌ను తయారుచేసి బిగించేందుకు అవకాశం లేకపోయింది. పైగా డ్యామ్ వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉందని కేంద్ర జల సంఘానికి బోర్డు అధికారులు, ఏపీ ఇంజనీరింగ్ అధికారులు, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలియజేశారు. ఈ నేపథ్యంలో.. నది ప్రమాదకరంగా ప్రవహిస్తున్నందున రిస్కు తీసుకోవద్దని జలసంఘం సూచించింది. నిర్దిష్ట స్థాయి వరకూ జలాలు కిందకు వెళ్లిపోయేదాకా ఆగి.. అప్పుడు స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వచ్చే ఏడాది నీటి ప్రవాహం తగ్గాక డ్యామ్ గేట్లు మొత్తం మార్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలని బోర్డుకు స్పష్టం చేసింది. కాగా.. క్రస్ట్ గేటు తయారీ బాధ్యతను విజయనగరంలోని తుంగభద్ర స్టీల్, హిందుస్థాన్ స్టీల్, నారాయణ స్టీల్ తయారీ కంపెనీలకు అప్పగించినట్లు ఏపీ అధికారులు తెలిపారు.

#### తెలుగు రాష్ట్రాల వాటా 78 టీఎంసీలు..

ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలు.. తెలంగాణలో జోగులాంబ గద్వాల జిల్లాలకు, కర్ణాటకకు సాగు, తాగునీరు అందించే జలజీవని తుంగభద్ర జలాశయం. దీని గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 135 టీఎంసీలు కాగా.. పూడిక చేరడంతో 105.788 టీఎంసీలకు కుదించారు. జూన్ 1 నుంచి మే 31 వరకు నీటి సంవత్సరంలో 212 టీఎంసీలు వినియోగించుకునేలా డిజైన్ చేశారు. కృష్ణా జలాల ట్రైబ్యునల్ అవార్డు-1 (బచావత్ అవార్డు) ప్రకారం..



# అగ్నిపథ్ మంచి స్కీం....





### మొదటి పేజీ తరువాయి

మందికిపైగా ప్రజలకు ముద్ర రుణాలందించి వ్యాపారాలను ప్రారంభించేలా చేశారన్నారు. గత 10 ఏళ్లలో దేశ బడ్జెట్ 3 రెట్లు పెరిగి రూ. 48 లక్షల కోట్లకు చేరుకుందని.. 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని చెప్పారు. కాంగ్రెస్ పాలకులు 370 ఆర్టికల్ ను తీసుకొస్తే ఏక్ దేశ్ మే దో విధాన్ పేరుతో మోదీ 370 ఆర్టికల్ ను రద్దు చేసి కాశ్మీర్ భారత్ లో అంతర్భాగమేనని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు.

#### కేంద్ర మంత్రికి ఆశాల వినతి

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు, పెండిరగ్ ఏరియర్స్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కేంద్ర మంత్రి బండి సంజయ్. తిమ్మాపూర్‌లో పలు ప్రారంభోత్సవాలకు వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని ఆశా కార్యకర్తలు కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆశా కార్యకర్తలకు నెలకు రూ. 18 వేలు చెల్లించాలని, సమ్మె కాలపు వేతనాలు పారితోషికాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

#### పలు కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఆర్‌కే కాలనీలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. మానకకొండూర్ మండలం అన్నారంలో ఎడిబుల్ టీ కప్స్ తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ..స్వయం ఉపాధి రంగాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఐదేళ్లలో 30 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు

### మొదటి పేజీ తరువాయి

చేస్తామన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా 6.30 లక్షల ఎకరాలకు గోదావరి నీరందించి ఉమ్మడి ఖమ్మంను సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా డిండి సాంఘిక సంక్షేమ గురుకులంలో దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల ప్రాజెక్టులపై సమీక్ష అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం గ్రామాల్లో సీతారామ పంప్‌హౌస్ ట్రయల్ రన్‌ను ఉత్తమ్ ప్రారంభించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీతారామ ట్రయల్ రన్ విజయవంతమైందని ఉత్తమ్ ప్రకటించారు. ఈ ఆగస్టు 15తో గోదావరి జలాల వినియోగం మొదలవుతుందన్నారు. 2026 ఆగస్టు 15 నాటికి పూర్తి ఆయకట్టుకు నీరందిస్తామని, ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాలో 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించి సస్యశ్యామలం చేస్తామన్నారు. కాగా, సీతారామ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించనున్న సభ ఏర్పాట్లను పొంగులేటితో కలిసి ఉత్తమ్ పరిశీలించారు.
15న భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద ఒక పంపుహౌజ్‌ను సీఎం, మరో పంపుహౌజ్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి, ఇంకోదానిని జిల్లా ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. సీతారామకు నెలాఖరులోగా పూర్తిస్థాయిలో అనుమతులు రాబోతున్నాయని ప్రకటించారు. సాగర్‌లో నీరు లేకపోయినా గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టుకు నీరిస్తామని చెప్పారు. వైరా సభలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. తుమ్మల మాట్లాడుతూ 2017లో ప్రారంభమైన సీతారామ పనులు మధ్యలో నత్తనడకన సాగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వేగం పెంచామని చెప్పారు. పొంగులేటి మాట్లాడుతూ సీతారామకు రూ.2,400 కోట్లు మాత్రమే ఖర్చు అయ్యేదని, కానీ డిజైన్ మార్చి గత ప్రభుత్వం రూ.18 వేల కోటు ఖర్చుచేసిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చాక ఈ ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యం కల్పించామన్నారు.

#### ఎంత ఖర్చయినా ఎస్ఎల్‌బీసీ, డిండి పూర్తి

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల తన మనసుకు దగ్గరగా ఉన్నాయని, ఎంత ఖర్చయినా సరే వీటిని పూర్తిచేస్తానని, మంత్రి ఉత్తమ్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. సొరంగ మార్గం పనులకు అంచనాలు సవరించి రూ.460 కోట్ల మంజూరుకు క్యాబినెట్ ముందుకుతీసుకెళ్తామని తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఐదు ఎత్తిపోతలకు తక్షణమే రూ.490 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

# కవితకు బెయిల్ వచ్చేనా..?

### మొదటి పేజీ తరువాయి

లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. మద్యం పాలసీ కేసులో కవిత సాక్ష్యాలను ధ్వంసం చేయడంతోపాటు సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారన్న దర్యాప్తు సంస్థల వాదనలతో ఢిల్లీ హైకోర్టు ఏకీభవించింది. "ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో 50 మందిని నిందితులుగా పేర్కొన్నాయి. అందులో కవిత మాత్రమే మహిళ. మహిళలకు కొన్ని ప్రత్యేక వెసులుబాట్లను చట్టాలు కల్పించాయి. మహిళా చట్టాలను పరిగణనలోకి తీసుకుని కవితకు బెయిల్ ఇవ్వండి. కవిత విషయంలో దర్యాప్తు సంస్థలు మొదటి నుంచీ చట్టాలను ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. అరెస్టు సమయంలో కనీస నిబంధనలు పాటించలేదు. మహిళలకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయి. వాటి కింద కవితకు బెయిల్ ఇవ్వాలి" అని కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు వినిపించిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఇరుపక్షాల సుదీర్ఘ వాదనల తర్వాత కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ కొట్టేశారు. ఇప్పుడు కవిత అవే అంశాల ఆధారంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారించనుంది. ఇదే ధర్మాసనం శుక్రవారం ఢిల్లీ మద్యం కేసులో మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు బెయిల్ మంజూరు చేసింది. ఈసారి తమ నాయకురాలికి తప్పనిసరిగా బెయిల్ వస్తుందని బీఆర్ఎస్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. కవితను మార్చి 15న ఈడీ అరెస్ట్ చేసింది. ఆమె నాటి నుంచి తిహాడ్ జైలులో ఉన్నారు. కవిత తిహాడ్ జైలులో ఉండగానే ఏప్రిల్ 15న సీబీఐ అరెస్టు చేసినట్టు ప్రకటించింది.

#### బ్రాండ్ తెలంగాణను బలిపెట్టొద్దు

వ్యక్తంచేశారు. ఇప్పటికే కేన్స్ టెక్నాలజీ తెలంగాణ నుంచి గుజరాత్‌కు, కార్నింగ్ సంస్థ తమ ప్లాంట్‌ను చెన్నైకి తరలించిందని ఉదహరించారు. తాజాగా అమరరాజా వెళ్లిపోతానని చెప్పటం తెలంగాణ బ్రాండ్‌కు నష్టమని చెప్పారు. రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడం మంచిది కాదని ప్రభుత్వానికి సూచించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ పాలసీలు ఉండాలని పేర్కొన్నారు.రాష్ట్రంలో రూ. 9,500 కోట్ల పెట్టుబడులు పెట్టేలా అమరరాజా సంస్థను ఎంతో కష్టపడి ఒప్పించామని, ప్రభుత్వం మారిన తర్వాత ఆ సంస్థ ఇబ్బందులు పడుతున్నట్టు తెలుస్తున్నదని పేర్కొన్నారు. సంస్థ విషయం లో కాంగ్రెస్ సర్కారు సానుకూలంగా స్పందించాలని సూచించారు. అమరరాజా సంస్థ తరలిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే కొనసాగిస్తుందని ఆశిస్తున్నానని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం
12 ఆగస్టు
2024





# మాసాయిపేటలో రమణీయం...కమనీయం

# మల్లన్న కళ్యాణం

## మల్లన్నను దర్శించుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

హాజరైన మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, జిల్లా కాంగ్రెస్ నాయకులు కానుగు బాలరాజు, గుండ్లపల్లి భరత్ గౌడ్

ప్రత్యేక పూజలు చేసిన మాజీ సర్పంచ్ గొట్టిపర్తి జయమ్మ బాలరాజు

పూజలను అన్నితానై నిర్వహించిన పాల సంఘం మాజీ చైర్మన్ గొట్టిపర్తి మల్లేశం గౌడ్

పూజల్లో పాల్గొన్న ఎస్.వీ.ఎన్ ఫౌండర్ భాస్కర్, ప్రిన్సిపల్ మాధురి

మాసాయిపేట మాజీ సర్పంచ్ భాగ్యమ్మ శ్రీనివాస్ కు శుభాకాంక్షలు తెలిపిన గొట్టిపర్తి కుటుంబ సభ్యులు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:
యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట కు చెందిన గొట్టిపర్తి మల్లేశం గౌడ్ నివాసంలో ఆదివారం నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహొత్సవం కన్నుల పండువుగా జరిగింది. గొట్టిపర్తి కుటుంబ సభ్యులు, మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై తమ భక్తి ప్రపత్తులతో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మల్లన్న గురించి వివరిస్తూ ఒగ్గు కళాకారులు బండ స్వామి బృందం మధురంగా మల్లన్న కథను వివరించారు. మల్లన్న జీవిత చరిత్రను కన్నులకు కట్టినట్లుగా భక్తులకు ఆవిష్కరింపజేశారు. మాసాయిపేట మాజీ ఉప సర్పంచ్ గొట్టిపర్తి భాగ్యమ్మా శ్రీనివాస్ దంపతుల పెద్ద కుమారుడు రఘు వివాహం సాయి ప్రియతో ఈ నెల 18న పీ.పీ.ఆర్ కన్వెన్షన్ అన్నోజీ గూడలో జరగనున్నది. ఈ నేపథ్యంలో కుటుంబ సంప్రదాయం మేరకు మల్లన్న పండుగను మూడు రోజులుగా నిర్వహించారు. చివరి రోజు కళ్యాణానికి భక్తులు... కుటుంభ సభ్యులు భారీగా తరలివచ్చి విజయవంతం చేసారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య,యాదగిరిగుట్ట తాజా మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, గుట్ట మండల కాంగ్రెస్ అధ్యక్షులు కానుగు బాలరాజ్ గౌడ్, జిల్లా నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, మాసాయిపేట మాజీ సర్పంచ్ జయమ్మ బాలరాజు గౌడ్, పాల సంఘం చైర్మన్ గా వరుసగా ఏడు టర్మ్ లు పనిచేసిన గొట్టిపర్తి మల్లేశం గౌడ్, కాంగ్రెస్ నాయకులు కోల లింగం గౌడ్, యాదగిరిగుట్ట ఎస్.వీ.ఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్, ప్రిన్సిపల్ మాధురి, గొట్టిపర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

















ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
12 ఆగస్టు
2024






# వైభవంగా గిరి ప్రదక్షిణ

**శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి స్వాతి నక్షత్రం సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు**

**గిరి ప్రదక్షణ చేసిన బీర్ల ఐలయ్య దంపతులు**

**పర్యవేక్షించిన ఈవో భాస్కరరావు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి సందర్భంగా ఆదివారం ఏర్పాటుచేసిన గిరి ప్రదక్షణకు భక్తుల నుంచి అపూర్వ స్పందన లభించింది. వేలాది మంది భక్తులు తరలివచ్చి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు స్వాతి నక్షత్రం సందర్భంగా కొండచుట్టు ప్రదక్షిణ చేశారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి భాస్కరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేలాదిమంది భక్తులు జై... నరసింహా జై జై నరసింహా అంటూ నినదీస్తూ స్వామి వారిని వేడుకుంటూ ప్రదక్షిణను పూర్తి చేశారు. అనంతరం కొండపైకి కాలినడకన చేరుకొని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా ఆలేర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గిరిప్రదక్షిణ లో వేలాది మంది భక్తులు పాల్గొనడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. స్వామివారి కృప వల్ల భారీగా వర్షాలు కురిసి ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం కావాలని వేడుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నదని, రైతు సంక్షేమం కోసం ఆగస్టు 15 వరకు 2 లక్షల రుణమాఫీ ని కూడా చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు నల్లం తీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాందూరీ వెంకటాచార్యులు, దేవస్థానం వేద పండితులు, ఆలేరు నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన పలు పార్టీల నాయకులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట పోలీసులు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.









# బోడుప్పల్ లోటస్ ల్యాప్‌లో ఘనంగా ఎన్నికలు

## నీతివంతమైన సమాజం కోసం లోటస్ ల్యాప్ కృషి: ట్రస్మా స్టేట్ ప్రెసిడెంట్ సాదుల మధుసూదన్

## క్రమశిక్షణ కలిగిన నాయకులతోనే దేశానికి మేలు: కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి





బోడుప్పల్, రోమింగ్ న్యూస్:
లోటస్ ల్యాప్ బోడుప్పల్ బ్రాంచ్ స్కూల్లో ఎన్నికలు ఆహ్లాదంగా జరిగాయి. రాజకీయ వ్యవస్థ పటిష్టత గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలియచెప్పాలన్న ఉద్దేశంతో నిర్వహించిన కార్యక్రమాన్ని ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షులు సాదుల మధుసూదన్ విద్యారత్న, లయన్, లోటస్ ల్యాప్ విద్యాసంస్థల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డిలు ప్రారంభించారు. రాజకీయ వ్యవస్థ అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నదని దీనివల్ల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన పెంపొందించాలన్న ఉద్దేశంతో ఎన్నికల నిర్వహించినట్లు చైర్మన్ గోపాల్ రెడ్డి చెప్పారు. నీతి, నియమాలతో కూడిన వ్యవస్థ ఏర్పాటు కావాలంటే అది విద్యార్థి దశ నుంచే మొదలుకావాలని ఆయన చెప్పారు. పసితనం నుంచి నాయకత్వ లక్షణాలు అందించే ఒక వేదిక పాఠశాల విద్యార్థి ఎన్నికలేనని ఈ సందర్భంగా చెప్పారు. సమాజం అభివృద్ధి పదాన్ని నడిచేందుకు పాఠశాల ఎన్నికలు నాణ్యమైన నాయకులను అందిస్తాయన్న నమ్మకం ఉందని చెప్పారు. ఎంత చదువు చదివినా రాజకీయాల్లోకి వచ్చేందుకు యువత ఉత్సాహం చదవడం చూపడం లేదని చెప్పారు. దీనివల్ల సామాజిక నష్టం జరుగుతుందని, బాగా చదివే ఉన్నత విద్యావంతులు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని చెప్పారు.

మూడవ తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థులు ఎన్నికల కార్యక్రమంలో పాల్గొన్నారు . నాయకులను ఎన్నుకోవడానికి విద్యార్థులు ఉత్సాహాన్ని ప్రదర్శించారు. సాధారణ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో వాటన్నిటిని కూడా స్కూలు ఎన్నికల్లో పాటించి ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు అంతా తమ లోగోలను చూపిస్తూ తమకు ఓటు వేయాలని విద్యార్థిని విద్యార్థులను వేడుకున్నారు. తాము గెలిస్తే విద్యార్థులకు ఏ విధంగా అవసరాలు తీర్చగలము అంటూ ప్రతి తరగతికి వెళ్లి రెండు రోజులుగా ప్రచారం చేసిన చేశారు. ఈరోజు పోలింగ్ సందర్భంగా ఒక్కొక్క విద్యార్థి కరెంట్ అఫైర్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజ శ్రేయస్సు ఆలోచించి రేపటి భావి భారత తరాలకి గొప్ప రాజకీయవేత్తలు కావాలన్నా సంకల్పాన్ని తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు నెరవేర్చాలని కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఓటింగ్ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు 90 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన రాజకీయాలను అలవంచ్చుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.











ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
12 ఆగస్టు
2024



# ఆరు పతకాలతో సంతృప్తి




చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా 117 మంది అథ్లెట్లతో పయనం.. ఈసారి రెండంకెల పతకాలు ఖాయమని అంచనాలు.. తీరా చూస్తే టోక్యో గేమ్స్‌కన్నా ఒకటి తక్కువగా ఆరు మెడల్స్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కచ్చితంగా పోడియంపై నిలబడతారనుకున్న అథ్లెట్లు నిరాశపరిచారు. మరి పారిస్ గేమ్స్‌ను ఏ విధంగా చూడాలి? ఒక్క స్వర్ణం కూడా లేకుండా వెనుదిరిగిన మనోళ్లు విజయవంతమైనట్టా.. లేదా? ఏ దేశ క్రీడా ప్రతిభ అయినా ఒలింపిక్స్ పతకాల పట్టిక చూస్తే తెలుస్తుంది. టోక్యోలో 48వ స్థానంతో మురిపిస్తే.. ఈసారి పతకాలు సాధించిన 91 దేశాల్లో మనది 71వ స్థానం. అయితే ఆరుగురు అథ్లెట్లు నాలుగో స్థానంలో నిలిచి భవిష్యత్‌పై భరోసా పెంచగలిగారు. ఈ నేపథ్యంలో తాజా ఒలింపిక్స్‌లో భారత ప్రస్థానం గురించి విశ్లేషించుకుంటే..

**గురి తప్పని షూటర్లు**

పారిస్ గేమ్స్‌లో భారత పతకాల పరువు కాపాడింది మాత్రం కచ్చితంగా షూటర్లే. రియో, టోక్యోల్లో ఒక్క పతకం కూడా తేలేకపోయిన వీరు.. పారిస్‌లో మాత్రం అభిమానులను ఖుషీ చేస్తూ ఏకంగా మూడు మెడల్స్‌ను ఖాతాలో వేసుకున్నారు. ఒకే గేమ్స్‌లో భారత్‌కు గతంలో ఇన్ని పతకాలు ఏ క్రీడాంశంలోనూ రాకపోవడం గమ నార్హం. పోటీల రెండో రోజే స్టార్ షూటర్ మను భాకర్ 10మీటర్ల వ్యక్తిగత ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్యంతో బోణీ చేసింది. అనం తరం మిక్స్‌డ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్‌తో కలిసి మను మరో కాంస్యం దక్కించుకుంది. ఇక రైఫిల్ 3 పొజిషన్‌లో ఎలాంటి అంచనాలూ లేని స్వప్నిల్ కుశాలె కంచు పతకంతో వహ్వా అనిపించుకున్నాడు.

**అంచనాలు తప్పారు..**

పారిసకు ముందు చివరి మూడు ఒలింపిక్స్‌లోనూ బ్యాడ్మింటన్‌లో భారత్‌కు పతకాలు వచ్చాయి. కానీ ఈసారి ఎక్కువగా నిరాశపరిచిన విభాగం ఇదే. రియోలో రజతం, టోక్యోలో కాంస్యంతో ఆకట్టుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధు అంచనాలతో బరిలోకి దిగి గ్రూప్ దశను మాత్రమే దాటగలిగింది. అటు డబుల్స్‌లో స్వర్ణం సాధిస్తారనుకున్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఓటమి అందరికీ షాక్‌ను కలిగించింది. ఇక బాక్సర్లు కూడా ఊహించని విధంగా రిక్తహస్తాలతోనే వెనక్కి రావాల్సి వచ్చింది. ఈ విభాగం కూడా భారత్‌కు గత మూడు ఒలింపిక్స్‌లో పతకాలను అందించింది. ఎప్పటిలాగే ఆర్చరీలో తొలి ఒలింపిక్ మెడల్ ఇంకా ఊరిస్తూనే ఉంది.

**వీరికి లక్కు లేకపాయె..**

తాజా ఒలింపిక్స్‌లో పతకాల సంఖ్యను పక్కనబెడితే..మన ఆటగాళ్ల ప్రదర్శన మరీ తీసికట్టుగా భావించలేం. ఓవిధంగా గతంకంటే మిన్నగా ఉందనే చెప్పుకోవాలి. ఎందుకంటే ఆరు ఈవెంట్లలో భారత్ నాలుగో స్థానంలో నిలిచి కాస్తలో కాంస్య పతకాలను చేజార్చుకుంది. పురుషుల 10మీ. ఎయిర్ పిస్టల్‌లో అర్జున్ బబుత, మహిళల 25మీ. ఎయిర్ పిస్టల్‌లో మను భాకర్ ఇలా పతకాలు పోగొట్టుకున్నవారే. అలాగే ఇదే విభాగం మిక్స్‌డ్ స్కీట్ టీమ్‌లో అనంత్‌జీత్ సింగ్, మహేశ్వరి కేవలం ఒక పాయింట్‌తో చైనాకు కాంస్యం కోల్పోయారు.

ఇక యువ షట్లర్ లక్ష్య సేన్ పురుషుల బ్యాడ్మింటన్ చరిత్రలో భారత్‌కు పతకం అందించే అవకాశాన్ని త్రుటిలో చేజార్చుకున్నాడు. సెమీస్‌లో తొలి గేమ్‌ను గెలిచినా ఆ ఊపు కొనసాగించలేకపోయాడు. టోక్యోలో రజతం అందుకున్న వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను కేజీ బరువు తేడాతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అలాగే ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్‌లో అంకిత-ధీరజ్ కాంస్య పతక పోరులో వెనుకబడి అపూర్వ అవకాశాన్ని కోల్పోయారు. అన్నింటికీ మించి రెజ్లర్ వినేశ్ ఫొగట్ వ్యవహారం ఎంతో బాధాకరం. ఇక్కడైతే భారత్‌కు కనీసం రజతం ఖాయంగా కనిపించింది. కానీ నిర్ణీత బరువు కంటే ఆమె 100 గ్రాములు ఎక్కువగా ఉండడంతో అనర్హత వేటు పడింది. ఒకవేళ 13న అనుకూలంగా తీర్పు వస్తే భారత్ ఖాతాలో మరో రజతం చేరుతుంది. తద్వారా టోక్యోతో సమానంగా ఏడు పతకాలను అందుకున్నట్టవుతుంది.

**రికార్డుల మోతతో..**

పతకాలు తక్కువగానే వచ్చినా కొందరు మాత్రం రికార్డులతో తమ పేరును చిరస్మరణీయం చేసుకున్నారు. ఈసారి దేశం నుంచి పతకం సాధించిన ఏకైక మహిళా అథ్లెట్‌గా షూటర్ మను భాకర్ నిలిచింది. ఒకే గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి స్వతంత్ర భారత అథ్లెట్‌గానూ చరిత్రకెక్కింది. 2008 ఒలింపిక్స్ నుంచి కనీసం ఇద్దరు మహిళలైనా మెడల్స్ అందుకున్నారు. 2012, 2016లలో ఇద్దరేసి, 2021లో ముగ్గురు పతకంతో మెప్పించారు. పారిస్‌లో ఆ చాన్స్ మనుకు దక్కింది. ఇక నీరజ్ చోప్రా కూడా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో రెండు పతకాలు సాధించిన భారత అథ్లెట్‌గా నిలిచాడు. అంతేకాకుండా భారత ఒలింపిక్స్ చరిత్రలో స్వర్ణం, రజతం అందుకున్న ఏకైక అథ్లెట్ చోప్రానే. వీరికి తోడు 21 ఏళ్ల యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ భారత్ నుంచి ఒలింపిక్ మెడల్ సాధించిన అత్యంత పిన్నవయస్కుడిగా రికార్డులకెక్కాడు. భారత హాకీ జట్టు 52 ఏళ్లలో తొలిసారి రెండు వరుస ఒలింపిక్ పతకాలు అందుకుని క్రీడా ప్రేమికులను సంతోషంలో ముంచెత్తింది.

**పారిస్‌లో పతక వీరులు**

| అథ్లెట్ | క్రీడాంశం | పతకం |
|---|---|---|
| మను భాకర్ | షూటింగ్ | కాంస్యం |
| మను భాకర్, సరబ్‌జోత్ సింగ్ | షూటింగ్ | కాంస్యం |
| స్వప్నిల్ కుశాలె | షూటింగ్ | కాంస్యం |
| పురుషుల హాకీ జట్టు | హాకీ | కాంస్యం |
| నీరజ్ చోప్రా | జావెలిన్ త్రో | రజతం |
| అమన్ సెహ్రావత్ | రెజ్లింగ్ | కాంస్యం |

# స్వర్ణాలలో సమం!





## ఓవరాల్‌గా అగ్ర పీఠంపై అమెరికా

## చైనాకు రెండో స్థానం

ఒలింపిక్స్ ముగిశాయి. రెండు వారాలకుపైగా..వేలాదిమంది అథ్లెట్లు తమ అద్భుత నైపుణ్యాలను ప్రదర్శించి విశ్వవ్యాప్తంగా కోట్లాదిమందిని అలరించారు. ఏ ఆటగాడైనా..ఏ జట్టయినా..ఎంత బాగా ఆడారన్నది అంతిమంగా వారు సాధించే పతకాన్ని చూసి నిర్ధారిస్తారు. ఒకప్పుడు ప్రపంచ రాజకీయాల్లో మాదిరే అమెరికా, సోవియట్ రష్యా విశ్వక్రీడల్లోనూ నువ్వా..నేనా..అనేలా ఢీకొనేవి. కానీ కాలం మారింది. ప్రస్తుతం అగ్రదేశం అమెరికాకు అన్ని రంగాల్లో చైనా సవాలు విసురుతోంది. ఆ క్రమంలో ఒలింపిక్స్‌లోనూ అమెరికాతో సై అంది. దాంతో ఈసారి స్వర్ణ పతకాలకోసం రెండు దేశాలు హోరాహోరీగా తలపడ్డాయి. శనివారం పోటీలు ముగిసే సరికి 39 స్వర్ణాలతో చైనా ఆధిపత్యం చెలాయించింది. అమెరికా ఒకటి తక్కువగా అంటే..38 పసిడి పతకాలతో రెండో స్థానంలో నిలిచింది. దాంతో ఆఖరి రోజు..ఆదివారం జరిగే ఈవెంట్లపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చైనాను దాటేసి అమెరికా పతక రేస్‌లో 'అగ్ర' స్థానంలో నిలుస్తుందా..లేదంటే డ్రాగన్ ఆధిపత్యం కొనసాగుతుందా..అనే విషయమై జోరుగా చర్చలు. చివరి రోజు వెయిట్ లిఫ్టింగ్ మహిళల 81 ఒకిలోల విభాగంలో లీ వెన్ వెన్ స్వర్ణం సాధించడంతో చైనా పతకాల సంఖ్య 40కి చేరింది.

అయితే సైక్లింగ్ మహిళల ఓమ్నియమ్ కేటగిరీలో జెన్నిఫర్ వాలెంటె తన పసిడి పతకాన్ని నిలబెట్టుకుంది. దాంతో అమెరికా స్వర్ణాల సంఖ్య 39కి చేరింది. ఈనేపథ్యంలో మహిళల బాస్కెట్‌బాల్ స్వర్ణ పతక పోరుపై ఆసక్తి పెరిగిపోయింది. అందుకుతగ్గట్టుగానే..అమెరికా-ఫ్రాన్స్ ఆ మ్యాచ్‌లో తగ్గేదేలె అన్నట్టు ఆడాయి. చివరకు ఒక పాయింట్ (67-66)తో జయకేతనం ఎగుర వేసిన అమెరికా బంగారు పతకం చేజిక్కించుకుంది. దాంతో అమెరికా, చైనా చెరో 40 స్వర్ణ పతకాలతో సమంగా నిలిచాయి. ఆఖరి రోజు అమెరికా మొత్తం ఐదు పతకాలు తన ఖాతాలో వేసుకుంది. బాస్కెట్‌బాల్, సైక్లింగ్ స్వర్ణాలుగాక, రెజ్లింగ్ మహిళల 76 కిలోలు, మహిళల వాలీబాల్‌లో రజతాలు, పురుషుల వాటర్‌పోలోలో కాంస్య పతకం సొంతం చేసుకుంది. కాగా..అమెరికా కాంస్య పతకాలలో ఆదివారంనాడు ఒకటి తగ్గింది. జిమ్నాస్టిక్స్ మహిళల ఫ్లోర్ ఫైనల్లో అమెరికాకు చెందిన జొర్డాన్ చైల్స్ అందుకున్న కాంస్యాన్ని..రుమేనియా జిమ్నాస్ట్ అనాకు ప్రకటించారు.అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోర్టు తీర్పు మేరకు పారిస్ క్రీడల నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక..మొత్తం 126 (40-44-42) మెడల్స్‌తో అమెరికా తనకు తిరుగులేదని మరోసారి నిరూపించుకుంది. టోక్యో విశ్వక్రీడల పసిడి పతకాల్లోనూ అమెరికా (39)దే పైచేయి. అప్పుడూ చైనా (38) రెండో స్థానంతో సరిపెట్టుకుంది. రియోలో అయితే అమెరికా (46 స్వర్ణాలు) ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో నిలిచింది.

# బాస్కెట్‌బాల్‌లో యూఎస్ 'డబుల్'





పారిస్: బాస్కెట్‌బాల్ ఆధిపత్యం చెలాయిస్తున్న అమెరికా పురుషుల జట్టు.. వరుసగా ఐదో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు యూఎస్ మహిళల జట్టు కూడా పసిడిని దక్కించుకొంది. ఎన్‌బీఏ స్టార్ స్టీఫెన్ కర్రీ 24 పాయింట్లతో విజృంభించడంతో.. ఫైనల్లో అమెరికా 98-87తో ఫ్రాన్స్‌ను ఓడించింది. కాంస్య పోరులో సెర్బియా 93-83తో జర్మనీపై నెగ్గింది. హోరాహోరీగా సాగిన మహిళల తుది పోరులో అమెరికా 67-66తో ఫ్రాన్స్‌పై గెలిచింది. బెల్జియాన్ని 85-81తో ఓడించిన ఆస్ట్రేలియా కాంస్యం దక్కించుకొంది.

# జమైకా జోరుకు గండి




పారిస్: ఒలింపిక్స్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్స్ ఈవెంట్లు ప్రత్యేక ఆకర్షణ. ఇక, ట్రాక్‌పై జమైనా స్ప్రింటర్లదే హవా. అయితే, ఇందంతా పారిస్ ఒలింపిక్స్‌కు ముందు. గత నాలుగు ఒలింపిక్స్‌లో మహిళల 100 మీటర్లలో అందుబాటులో ఉన్న 12 పతకాల్లో పది మెడల్స్ జమైకావే. ఇక, టోక్యో క్రీడల్లో అయితే క్లీన్ స్వీప్ చేశారు. గత ఐదు 200 మీటర్ల ఈవెంట్లలో అమెరికా నుంచి గట్టిపోటీ ఎదురైనా జమైకా అథ్లెట్లు నాలుగు నెగ్గారు. కానీ, 2024 ఒలింపిక్స్‌కు వచ్చేసరికి పరిస్థితి తారుమారైంది. రియోలో 11 పతకాలు, టోక్యోలో 9 మెడల్స్ సాధించిన జమైకా.. పారిసలో మాత్రం ఆరు పతకాలతో సరిపెట్టుకొంది. ఎలేనా థాంప్సన్ హెరా, షెల్లీ అన్ ఫ్రేజర్ ప్రైస్, జాక్సన్‌లు గాయాలు, తదితర కారణాలతో వైదొలగడం జమైకా ఆధిపత్యానికి గండికొట్టింది. ఒక్క జమైకా అథ్లెట్ కూడా పోడియం ఫినిష్ చేయలేక పోవడం 1988 తర్వాత ఇదే తొలిసారి. 4గీ400 రిలేలో పూర్తిగా చేతులెత్తేశారు.





## ఫారిన్ బ్యూటీలా మురిపిస్తోన్న సీతమ్మ!

గ్లామర్ వరల్డ్ లో అందాల భామల మధ్య పోటీ ఎలా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. ఎవరైనా నిత్య నూతనంగా కనిపించాల్సిందే. అందులోనూ తాము సంథింగ్ స్పెషల్ అనిపించాలి. నలుగురి దారిలో వెళ్లడం కాదు. నలుగురు మన దారిలో నడిచేలా చేసినప్పుడే సక్సెస్ అవుతాం. భామల మధ్య పోటీని తట్టుకుని నిలబడాలంటే? ఎలివేషన్ పరంగా ఎంతో చేయాల్సి ఉంటుంది.  ఆ విషయంలో కృతిసనన్ అలియాస్ సీతమ్మ ఏమాత్రం తగ్గదు. సక్సెస్ క్రేజ్ని తెలివిగా రెట్టింపు చేసు కుంటుంది. ఫ్యాషన్ వరల్డ్ లో తానో బ్రాండ్ అని ఇప్పటికే చాలా సందర్భాల్లో ప్రూవ్ చేసింది. డిఫరెంట్ డిజైనర్ కాస్ట్యూమ్స్ లో కృతికి పోటీ ఉంటుందా? అనిపించింది. తాజాగా అమ్మడు మరోసారి నెటి జనుల దృష్టిని ఆకర్షించే లుక్ తో వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా ఏకంగా విదేశీ మోడల్స్ నే తలపించింది.  కాళ్లకు హైహీల్స్ ధరించి..రెండు చేతులు చాచి వివిధ భంగిమల్లో కెమెరాకి ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ అవుతుంది. కృతిని ఇలాంటి ఫోజులో అభిమానులు ఇంతవరకూ చూడలేదు. దీంతో ఆ ఫోటో సంథింగ్ స్పెషల్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఇటీవలే %-%ది క్రూ%-%తో అమ్మడు మరో సక్సస్ ఖాతాలో వేసుకున్న సంగతి తెలిసిందే.

## డార్క్ షేడ్ అందాలతో తెలుగమ్మాయి

డాన్స్ ట్యూటర్ గా కాలేజ్ డేస్ లోనే డాన్స్ ను తన కెరీర్ గా ఎంపిక చేసుకున్న తెలుగు అమ్మాయి తేజస్వి మదివాడ 2013 లో మహేష్ బాబు, వెంకటేష్ కలిసి నటించిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమా లో సహాయ నటిగా నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమాలో సమంత సోదరి పాత్రలో నటించి మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. సమంత కజిన్ లు గా ఆ సినిమాలో చాలా మంది కనిపించారు. కానీ తేజస్వి కి వచ్చిన గుర్తింపు మరెవ్వరికీ రాలేదు. ఆ సినిమా ఇచ్చిన గుర్తింపు తో ఇండస్ట్రీలో మంచి ఆఫర్లను తేజస్వి మదివాడ దక్కించుకుంది.

ముఖ్యంగా ఐస్ క్రీమ్ తో పాటు హార్ట్ ఎటాక్ ఇంకా కొన్ని సినిమాల్లో నటించడం ద్వారా ఎక్కువ మంది ప్రేక్షకులకు నటిగా చేరువ అయ్యింది. ఐస్ క్రీం సినిమాలో ఒక సన్నివేశం కోసం తేజస్వి ఏకంగా పూర్తి నగ్నంగా కనిపించి సంచలనం సృష్టించింది. ఒక తెలుగు అమ్మాయి ఆ స్థాయిలో నటించడం ప్రథమం అంటూ ప్రముఖ మీడియాల్లో కథనాలు వచ్చాయి. ఆ సినిమా తర్వాత తేజస్వి కి చాలా ఆఫర్లు వస్తాయనే ప్రచారం జరిగింది. కానీ ఆమె వర్మ కాంపౌండ్ కు చెందిన అమ్మాయి అనే ప్రచారం జరగడంతో చాలా మంది ఆమెకు ఆఫర్లు ఇచ్చేందుకు ఆసక్తి చూపించలేదు అనే అభిప్రాయం ఉంది.

చిన్న చిన్న పాత్రల్లో నటించడంతో పాటు, బుల్లి తెరపై కూడా తనదైన శైలిలో వినోదాన్ని పంచడం ద్వారా రెగ్యులర్ గా వార్తల్లో ఉంటుంది. 2018 లో బిగ్ బాస్ తెలుగు లో పాల్గొన్న ఈమె కొన్ని వివాదాల కారణంగా చాలా తొందరగా బయటకు వచ్చింది. ఆ షో వల్ల తేజస్వి కి మరింత నెగటివిటీ పెరిగింది అనేది కొందరి అభిప్రాయం. ఆ మధ్య పెళ్లి చేసుకునేందుకు ఆసక్తి చూపించింది. కానీ పెళ్లి చేసుకుంటే తన గుర్తింపు పోతుందనే ఉద్దేశ్యంతో పెళ్లి నిర్ణయాన్ని రద్దు చేసుకున్నాను అంటూ ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది.

తాజాగా మరోసారి ఇన్స్టాలో అందాల ఫోటోలను తేజస్వి షేర్ చేసింది. ఈసారి డార్క్ షేడ్ అందాల ఫోటోలను ఈమె షేర్ చేసింది. బ్లాక్ అండ్ వైట్ తో పాటు చీకట్లో తేజస్వి ఉన్నట్లుగా ఈ ఫోటోలో చూడవచ్చు. అంత డార్క్ షేడ్ లోనూ తేజస్వి అందమైన రూపం చూపరుల దృష్టిని మరల్చనివ్వడం లేదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఈ అమ్మడి అందాల ఫోటోలకు స్పందన లభిస్తోంది. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాకపోవడంకు కారణం తెలుగు అమ్మాయి అవ్వడమే అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## రకుల్ ప్రీత్ పూల్సైడ్ ట్రీట్..

ఇటీవల భగ్నానీల నిర్మాణ సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందంటూ ప్రచారం సాగింది. కొన్ని భారీ చిత్రాల పరాజయం కారణంగా వందల కోట్ల మేర బాక్సాఫీస్ నష్టాలను చవి చూసిన ఈ సంస్థ తిరిగి అప్పుల నుంచి బయటపడేందుకు కొంత సమయం పడుతుంది. అయితే ఇవేవీ పట్టనట్టు ఈ సంస్థ అధిపతుల్లో ఒకరైన య-ువనటుడు, నిర్మాత అయిన జాకీ భగ్నానీతో అతడి సతీమణి రకుల్ ప్రీత్ సింగ్ విహారయాత్రలు ఇప్పుడు ఇంటర్నెట్ లో అగ్గి రాజేస్తున్నాయి. రకుల్ ఫుల్ ఫ్రీడమ్ని ఆస్వాధిస్తోంది. భర్త జాకీ భగ్నానీతో కలిసి వెల్ నెస్ ట్రిప్ ని ప్లాన్ చేసింది. ఈ జంట అందమైన నదీతీర ప్రాంతంలో జాలీ రైడ్ లు ఆస్వాధిస్తున్నారు. అందుకు సంబంధించిన ఫోటోలు వీడియోలను రకుల్ ప్రీత్ తాజాగా ఇన్ స్టాలో షేర్ చేయగా అవి వైరల్ గా మారాయి. రకుల్ స్విమ్ సూట్ ధరించి నదిలోకి జంప్ చేస్తున్న ఒక వీడియో , ఫోటోలు కూడా వేగంగా వైరల్ అవుతున్నాయి. అలాగే నదిలో వాటర్ స్పోర్ట్స్ ని అడ్వెంచర్ స్పోర్ట్స్ ని ఆస్వాధిస్తూ అందరి కళ్లను తమవైపు తిప్పేసుకుంది ఈ జంట. ఈ వారం ఇప్పుడే ప్రయాణించి వచ్చాం.. నా బెస్ట్ గై జాకీ భగ్నానీ.. కొంత సమయం ఆనందంగా గడిపాను అంటూ రకుల్ అసలు విషయం తెలిపింది. దీనికి ప్రగ్య జైశ్వాల్ సహా పలువురు సహనటీమణులు లవ్ హార్ట్ ఈమోజీలతో ప్రతి స్పందించారు. రకుల్ కెరటం అనే చిన్న చిత్రంతో టాలీవుడ్ లో అడుగుపెట్టింది. సందీప్ కిషన్ వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ తో విజయం అందుకుంది. ఆ తర్వాత మహేష్, చరణ్, ఎన్టీఆర్, మహేష్ వంటి అగ్ర తారల సరసన నటించింది. తమిళంలోను పెద్ద హీరోల సరసన నటించింది. కానీ చివరికి బాలీవుడ్ లో స్థిరపడి అక్కడే సినీనిర్మాత జాకీ భగ్నానీని పెళ్లాడింది. మిగతా కథంతా తెలిసినదే.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986